



# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 333 | ఆగస్టు 1 శనివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# "క్రిమినల్ వేస్ట్" ఇంజినీరింగ్ విద్యార్థులపై

## సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో రాజకీయ దుమారం



- ఇంజినీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలు
- ఈ వ్యాఖ్యలతో తెలంగాణలో చెలరేగిన రాజకీయ దుమారం
- సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీఆరఎస్, బీజేపీ
- రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని విపక్షాల డిమాండ్

"విద్యార్థుల భావోద్వేగాలను దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు!"

వెంటనే క్షమాపణ చెప్పాలి!

తెలంగాణలోని ఇంజినీరింగ్ విద్యార్థుల ఉపాధి నైపుణ్యాల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన 'క్రిమినల్ వేస్ట్' వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రతిఏటా 1.1 లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నప్పటికీ, వారిలో కొందరు కనీసం ఉద్యోగ దరఖాస్తును కూడా నింపలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఒక తెల్ల కాగితం ఇచ్చి అప్లికేషన్ రాయమంటే రాయలేని పరిస్థితి నెలకొంది. ఇది 'క్రిమినల్ వేస్ట్'. ఇంజినీరింగ్ చదివామంటూ చిన్న ఉద్యోగాలకు వెళ్లరు, అదే సమయంలో అవసరమైన నైపుణ్యాలను కూడా అలవర్చుకోరు" అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు.


(మిగతా 2వ పేజీలో..)


## మోదీకి ఇస్లామాబాద్ నుంచి ఆహ్వానం? పాకిస్థాన్ సంకేతాలు..!

- 2027 ఎస్‌సీఓ సదస్సుకు మోదీకి ఆహ్వానం పంపనున్నట్లు సంకేతం
- ఎస్‌సీఓ నిబంధనల ప్రకారమే ఆహ్వానమన్న ఆ దేశ విదేశాంగ శాఖ
- సభ్య దేశాలన్నింటికీ ఆహ్వానాలు పంపనున్న పాక్
- జైశంకర్-పాక్ మంత్రి భేటీపై స్పష్టత
- 2027 సదస్సుకు ఇస్లామాబాద్ ఆతిథ్యం
- ఎస్‌సీఓలో మొత్తం 10 సభ్య దేశాలు

2027లో ఇస్లామాబాద్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని పాకిస్థాన్ సంకేతాలు ఇచ్చింది. ఎస్‌సీఓ నిబంధనల ప్రకారం సభ్య దేశాల అధినేతలందరికీ ఆహ్వానాలు పంపడం ఆతిథ్య దేశం బాధ్యత అని పాకిస్థాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి తెలిపారు.


(మిగతా 2వ పేజీలో..)




## తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ.. మరోసారి గడువు పొడిగింపు

- ఆగస్టు 10 వరకు ఇంటింటి పరిశీలనకు అవకాశం
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నెమ్మదిగా సాగుతున్న సర్వే
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77 శాతం ప్రక్రియ పూర్తి

తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ





(మిగతా 2వ పేజీలో..)


## కర్ణాటకకు రావొద్దు.. తమిళనాడు సీఎం విజయ్‌కు డీకే శివకుమార్ సూచన

- కావేరి ఉద్రిక్తతల పర్యటన సరికాదని సూచన
- అఖిలపక్ష సమావేశం తర్వాత కొత్త తేదీ
- వర్షాలతో పరిస్థితులు మెరుగుపడతాయని డీకేఎస్ ఆశాభావం
- మేకెదాటు ప్రాజెక్టు తమిళనాడుకూ ఉపయోగకరమన్న శివకుమార్
- సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడతామని స్పష్టీకరణ

కావేరి వివాదం నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బెంగళూరు పర్యటనను వాయిదా వేసుకోవాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్


(మిగతా 2వ పేజీలో..)




## ఆప్త మిత్రుణ్ని కోల్పోయా.. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపై కేసీఆర్ భావోద్వేగం

- పెద్ది మృతిపై కేసీఆర్ తీవ్ర సంతాపం
- ఉద్యమ సహచరుణ్ని కోల్పోయానని వ్యాఖ్య
- పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా
- తెలంగాణ ఉద్యమంలో పెద్ది సేవలను గుర్తుచేసిన కేసీఆర్
- నర్సంపేటలో గులాబీ జెండా ఎగురవేసిన ధీరుడని ప్రశంస
- బీఆర్ఎస్‌కు తీరని లోటని ఆవేదన

ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతిపై బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. తానొక ఆప్త మిత్రుణ్ని, ఉద్యమ సహచరుడిని


2




మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ఆప్త మిత్రుణ్ని కోల్పోయా.. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపై కేసీఆర్ భావోద్వేగం

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది కుటుంబ సభ్యులకు, పార్టీ శ్రేణులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పెద్దిని కాపాడేందుకు పార్టీ చేసిన ప్రయత్నాలు, వైద్యులు చేసిన కృషి ఫలించకపోవడం బాధాకరమని అన్నారు. ఈ పరిణామం తనకు తీవ్ర మనోవేదన కలిగించిందని పేర్కొన్నారు.తెలంగాణనే శ్వాసగా భావించి నీతి, నిజాయతీతో ప్రజా జీవితాన్ని కొనసాగించిన నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అని కేసీఆర్ కొనియాడారు. పోరాటాల గడ్డ ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేటలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసిన ధీరుడని చెప్పారు. ఉద్యమ కాలం నుంచి చివరి శ్వాస వరకు గులాబీ జెండా నీడలోనే ఆయన రాజకీయ ప్రస్థానం సాగిందని గుర్తు చేశారు. ఉద్యమంలోనూ, నియోజకవర్గ అభివృద్ధిలోనూ పెద్ది తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కేసీఆర్ అన్నారు. పార్టీపట్ల అత్యంత విధేయతతో పనిచేసిన నాయకుడిగా ఆయన్ను అభివర్ణించారు. సుదర్శన్‌రెడ్డి మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ.. మరోసారి గడువు పొడిగింపు

(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి పరిశీలన గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. వాస్తవానికి ఆగస్టు 3తో ముగియాల్సిన ఈ గడువును ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం సర్వే పూర్తయినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అయితే, హైదరాబాద్ (56.31 శాతం), రంగారెడ్డి (63.43 శాతం), మేడ్చల్–మల్కాజ్‌గిరి (61.37 శాతం) వంటి కీలక జిల్లాల్లో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో గడువును పెంచాల్సి వచ్చింది. ఈ సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లను నిర్ధారించడం, నకిలీ ఓట్లను గుర్తించడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి పనులను చేపడుతున్నారు. ఓటర్ల జాబితా సవరణకు తొలుత జూలై 24ను తేది గడువుగా నిర్ణయించగా, దానిని ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా మరో వారం గడువు పెంచుతూ ఆగస్టు 10 వరకు అవకాశం కల్పించారు.

## కర్ణాటకకు రావొద్దు.. తమిళనాడు సీఎం విజయ్‌కు డీకే శివకుమార్ సూచన

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ఆగస్టు 3న మంత్రులతో కలిసి బెంగళూరుకు వస్తానని విజయ్ తెలిపారని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యటన సరైనది కాదని తాను వివరించినట్లు చెప్పారు.విధానసౌధలో ఉప ముఖ్యమంత్రి జి.పరమేశ్వర, జలవనరుల శాఖ మంత్రి రామలింగారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడిన శివకుమార్.. అతిథులు వచ్చినప్పుడు ఆహ్వానించడం తమ బాధ్యతని అన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా నిరసనలు చేపట్టినా, నినాదాలు చేసినా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. అందుకే కొంతకాలం ఓపిక పట్టాలని విజయ్‌ను కోరినట్లు వెల్లడించారు.ఆదివారం జరగనున్న అఖిలపక్ష సమావేశం తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని శివకుమార్ తెలిపారు. ప్రస్తుతం కర్ణాటకలో వర్షాలు కురుస్తుండటంతో జలాశయాల్లోకి నీటి ప్రవాహం పెరుగుతోందని, దీంతో చర్చలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొత్త తేదీ ఖరారు చేస్తామని చెప్పారు.మేకెదాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు కర్ణాటకతో పాటు తమిళనాడుకూ ప్రయోజనం చేకూరుస్తుందని శివకుమార్ అన్నారు. ఈ ప్రాజెక్టు తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి కోసమేనని, సాగునీటి అవసరాలకు కాదని స్పష్టం చేశారు. కావేరి జలాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తామని, అయితే వర్షాభావం, నీటి లభ్యత వంటి ప్రస్తుత పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

## మోదీకి ఇస్లామాబాద్ నుంచి ఆహ్వానం? పాకిస్థాన్ సంకేతాలు..!

(మొదటి పేజీ తరువాయి)

ఆ ప్రక్రియలో భాగంగానే భారత్‌కూ ఆహ్వానం అందుతుందని స్పష్టం చేశారు.ఇస్లామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఎస్‌సీఓలో సభ్య దేశమైన భారత్‌కు కూడా మిగతా దేశాల మాదిరిగానే అధికారిక ఆహ్వానం పంపుతామని చెప్పారు. ఇది ఎలాంటి ప్రత్యేక నిర్ణయం కాదని, సంస్థ అమలు చేస్తున్న విధానంలో భాగమేనని వివరించారు.మరోవైపు ఫిలిప్పీన్స్‌లో జరుగుతున్న ఆసియాన్ సమావేశాల సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మధ్య భేటీ జరగనున్నట్లు వస్తున్న వార్తలపై కూడా స్పందించారు. అలాంటి సమావేశం కోసం భారత్ నుంచి ఎలాంటి అభ్యర్థన తమకు అందలేదని పాకిస్థాన్ తెలిపింది. ఎస్‌సీఓలో అధ్యక్ష బాధ్యతల మార్పిడి విధానంలో భాగంగా 2027 సదస్సుకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. చైనా, రష్యా, భారత్, పాకిస్థాన్‌తో పాటు మొత్తం 10 దేశాలు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నాయి. యురేషియా ప్రాంతంలో శాంతి, భద్రత, ఆర్థిక సహకారాన్ని పెంపొందించడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం.

# “క్రిమినల్ వేస్ట్”.. ఇంజినీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డిని “చీఫ్ మినిస్టర్” అని సంబోధిస్తూ, ఆయన విద్యార్హతలను ప్రశ్నించారు. “రియల్ ఎస్టేట్ బ్రోకర్ స్థాయి నుంచి బ్లాక్‌మెయిలర్‌గా ఎదిగారు” అంటూ ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థులపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడానికి ముఖ్యమంత్రికి ఉన్న అర్హత ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. తన జీవితంలో రేవంత్ రెడ్డి ఎప్పుడైనా పోటీ పరీక్షలు రాశారా? లేదా ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారా? ఎక్కడైనా ఉద్యోగం చేశారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు.ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. తక్షణమే సీఎం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు బీజేపీ నేతలు సైతం ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇది యువతను కించపరచడమేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఉద్యోగాల కల్పనతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాజకీయంగా విమర్శలు వెల్లువెత్తడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను విద్యార్థులను విమర్శించలేదని, వారికి సరైన నైపుణ్యాలు అందించడంలో విఫలమవుతున్న విద్యా వ్యవస్థను మాత్రమే ఉద్దేశించానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి మద్దతుగా నిలిచారు. విద్యార్థుల్లోని నైపుణ్యాల అంతరాన్ని సరిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమని పేర్కొంటూ కేటీఆర్ విమర్శలను తిప్పికొట్టారు.

## ఉగ్రరూపం దాల్చిన గోదావరి.. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ!

**ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉగ్రరూపం**

**భద్రాచలం వద్ద 44 అడుగులకు చేరుకున్న నీటిమట్టం**

**లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు**



ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. భారీగా వచ్చి చేరుతున్న వరద నీటితో ఈ ఉదయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 44 అడుగులకు చేరింది. ప్రస్తుతం 9,74,666 క్యూసెక్కుల మేర ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.వరద ఉద్ధృతికి కల్యాణకట్ట, స్నాన ఘట్టాలు పూర్తిగా నీట మునిగాయి. సాయంత్రానికి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేసింది. అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు రెవెన్యూ, విపత్తు నిర్వహణ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రజలెవరూ గోదావరి వైపు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు. మరోవైపు తెలంగాణవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు శ్రీరాంసాగర్, మిడ్‌మానేరు, సింగూరు, ఎల్లంపల్లి, జూరాల వంటి ప్రధాన ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. కాళేశ్వరం వద్ద కూడా గోదావరి నీటిమట్టం 11.29 మీటర్లకు చేరి ప్రమాద స్థాయికి దగ్గరగా ప్రవహిస్తోంది. రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## భోగాపురం.. ఆధునిక ఎయిర్ పోర్టుకు ప్రతిరూపం: ప్రధాని మోదీ

**భోగాపురంలో రేపు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం**

**భోగాపురంలో సెమీకండక్టర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన**

**కర్నూలు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుకు శ్రీకారం**

**కీలక జాతీయ రహదారి ప్రాజెక్టులు జాతికి అంకితం**

**సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన ప్రధాని నరేంద్ర మోదీ**

ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించే ఈ ప్రాజెక్టుల వివరాలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. వీటిలో ప్రధాన ఆకర్షణగా విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తోంది. ఈ విమానాశ్రయానికి సంబంధించిన ఆకర్షణీయమైన ఫొటోలను కూడా ప్రధాని పంచుకున్నారు.భోగాపురం విమానాశ్రయం ఒక ఆధునిక, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా నిర్మించిన ప్రాజెక్టు అని ప్రధాని అభివర్ణించారు. కనెక్టివిటీ, వాణిజ్యం, పర్యాటకాన్ని ఇది గణనీయంగా పెంచుతుందని తెలిపారు. సుస్థిరత, ఇంధన సామర్థ్య సూత్రాలను పాటిస్తూ ఈ విమానాశ్రయాన్ని నిర్మించారని పేర్కొన్నారు. వీటితో పాటు మరిన్ని కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నట్లు మోదీ వెల్లడించారు. భోగాపురంలో ఏఎస్ఐపి సెమీకండక్టర్ ప్రాజెక్టుకు, అలాగే కర్నూలు-IV పునరుత్పాదక ఇంధన జోన్ (ఆర్ఈజెడ్) మొదటి దశ అనుసంధానానికి సంబంధించిన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో, రాష్ట్రంలో పూర్తయిన కొన్ని కీలకమైన రహదారి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నట్లు ప్రధాని తన పోస్టులో వివరించారు. వీటిలో ఎన్ హెచ్–365బీజీ పరిధిలోని రేచెర్ల – గురువాయిగూడెం మధ్య నాలుగు వరుసల రహదారి, గురువాయిగూడెం – దేవరపల్లి సెక్షన్, ఎన్ హెచ్–67పై నిర్మించిన తాడిపత్రి బైపాస్ ఉన్నాయని పేర్కొన్నారు. విమానయానం, సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, రహదారి రవాణా వంటి కీలక రంగాల్లో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్





**మన దునియా, జులై 31,మంచిర్యాల జిల్లా**

వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్, బెల్లంపల్లి సబ్‌డివిజన్‌లోని మందమర్రి పోలీస్ స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, స్టేషన్‌లోని వివిధ రకాల కీలక రికార్డులు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన ఫైళ్లను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిర్యాదులు,కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని, సీసీటీఎన్ఎస్‌లో నమోదులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. కోర్టులతో సమన్వయంతో పనిచేసి ఎక్కువ కేసుల్లో శిక్షలు అమలయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు రక్షణ, భద్రత కల్పించడం పోలీసుల ప్రాథమిక విధి,బాధ్యత అని పేర్కొన్నారు. సిబ్బంది విధులను నిరంతరం పర్యవేక్షిస్తూ,వారు సమర్థవంతంగా పనిచేసేలా వారి నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై నేరాల నివారణకు కృషి చేయాలని అన్నారు. ఈ తనిఖీలో మందమర్రి సీఐ పి. రమేష్, మందమర్రి ఎస్ఐ నరేష్, పోలీస్ స్టేషన్ స్టాఫ్ పాల్గొన్నారు.

# గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) 20వ స్ట్రక్చర్ మీటింగ్

**మన దునియా, జులై 31,మంచిర్యాల జిల్లా**

సింగరేణి కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా, వారి పలు సమస్యల పరిష్కారానికై మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జీఎం) ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన గుర్తింపు కార్మిక సంఘం (ఏ.ఐ.టి.యు.సి - ఏఐటీయూసీ) తో 20వ నిర్మాణాత్మక సమీక్షా సమావేశం (స్ట్రక్చర్ మీటింగ్) అత్యంత సౌహార్దపూర్వక వాతావరణంలో జరిపారు. శుక్రవారం నాడు మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఈ కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏ.ఐ.టి.యు.సి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ, సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ, దాగం మల్లేష్, రామకృష్ణపూర్ బ్రాంచ్ సెక్రటరీ, అక్బర్ అలీ, ఏఐటియుసి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి ఇతర ముఖ్య నాయకులు పాల్గొని కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ?ఉత్పత్తితో పాటు కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యత: జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ అభివృద్ధిలోనూ, ఉత్పత్తి ఉత్పాదకత సాధనలోనూ కార్మిక సంఘాల పాత్ర అత్యంత కీలకమైనదని కొనియాడారు. సంస్థ కేవలం ఉత్పత్తి లక్ష్యాలకే పరిమితం కాకుండా, ఉద్యోగుల, కార్మికుల సంక్షేమానికి అగ్రతాంబూలం ఇస్తుందని స్పష్టం చేశారు. గత సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా సమీక్షించారు. యూనియన్ ప్రతినిధులు ప్రస్తావించిన ముఖ్యమైన అంశాలు:ఆపరేటర్లకు అవసరమైన పనిముట్లు రెన్ కోట్లు అందించడం. పెండింగ్లో ఉన్న టెండల్ సూపర్వైజర్ ప్రమోషన్ పరీక్షను నిర్వహించడం. వర్క్ షాప్ లో ఝమౌలిక సదుపాయాలను మెరుగుపరచడం. ఎస్ అండ్ పిసి మహిళా సెక్యూరిటీ గార్డుల కోసం అవసరమైన సౌకర్యం అందించాలి. కాసిపేట 1 అండ్ 2 కాసిపేట-1,1A అండ్ 2 గనులకు వెళ్లే మార్గాలలో రోడ్లకు మరమ్మత్తులు చేయడం, రోడ్లకు ఇరువైపులా ఉన్న పొదలను తొలగించడం, వీధి దీపాలను ఏర్పాటు చేయడం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడం ద్వారా రహదారి భద్రతను మెరుగు పరచగలరు. జిఎం కార్యాలయంలో మహిళా టాయిలెట్ సమీపంలో ఉన్న ప్రహరీ గోడ నిర్మాణం.





**అధికారులకు జీఎం ఆదేశాలు -**

యూనియన్ నాయకులు ప్రస్తావించిన సమస్యలపై జీఎం సానుకూలంగా స్పందించారు. అర్హత కలిగిన అన్ని పనులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. ఇప్పటివరకు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కార్మికులు, సంఘాలు అందించిన సహకారం అభినందనీయమని, భవిష్యత్తులోనూ ఇదే విధమైన సహమతితో ముందుకు సాగాలని జీఎం కోరారు. పాల్గొన్న ముఖ్య నాయకులు, అధికారులు ?ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఎస్.ఓ టు జీఎం (ఎస్ టూ జీఎం) జి.ఎల్. ప్రసాద్, ఏరియా ఈ అండ్ ఎం, బాలాజీ భగవతి ఝ, కే కే గ్రూప్ ఏజెంట్, ఖాదిర్, (ఎస్ కే) గ్రూప్ ఏజెంట్ సంతోష్ కుమార్, డీజీఎం (పర్సనల్) అశోక్, డీజీఎం (ఐఈడీ) కిరణ్ కుమార్, డీజీఎం (సివిల్) షేక్ మదీనా భాష, డీజీఎం ఏరియా స్టోర్స్,రవీందర్, వర్క్ షాప్ డివై ఎస్సీ, నరేష్, ఎస్ ఎస్ ఓ(ఎస్ ఒ పి సి) వెంకటేశ్వర రెడ్డి, ఫారెస్ట్ అధికారి నవీన్, సీనియర్ పి.ఓ కార్తీక్, ?యూనియన్ తరఫున ఏఐటియుసి, ఏరియా కమిటీ వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్, సివి రమణ , జిఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ రాజేశం, ఇతర సీనియర్ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సువర్ణ వనమాలకు డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఘన నివాళి

**మన దునియా,మంథని :జులై 31**

ఉమ్మడి రాష్ట్ర మాజీ శాసనసభ స్పీకర్, దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు, సహోదరి, తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహా రాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, వారి మేనత్త సువర్ణ వనమాల ఇటీవల మరణించగా..ఆమె దశ-దిన కర్మ కార్యక్రమం శుక్రవా రం మంథనిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబుతో కలిసి మంథని మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొడారి మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహావాది సతీష్ కుమార్, ముఖ్య సలహాదారు లు మేడగోని రాజ మౌళి గౌడ్,కార్యవర్గ సభ్యుడు మాదేశి శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సువర్ణ వనమాల చిత్రపటా నికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు. వనమాల ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థి స్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.



## ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో కీలకం

**దేవాపూర్ ఎస్ఐ గంగారం**

**మన దునియా, జూలై 31, మంచిర్యాల జిల్లా**



ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో కీలకమని కాసిపేట మండలం దేవాపూర్ ఎస్ఐ గంగారం అన్నారు. శుక్రవారం కాసిపేట మండలంలోని కొండాపూర్ యాపలో స్థానిక సర్పంచ్, వ్యాపారులు సంయుక్తంగా నాలుగు పాత సీసీ కెమెరాలను మరమ్మత్తు చేయించడంతో పాటు మరో మూడు నూతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ గంగారం మాట్లాడుతూ, నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజల భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గ్రామాలు, వ్యాపార సముదాయాలు, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందన్నారు. ప్రజల భద్రత కోసం ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టిన స్థానిక సర్పంచ్‌తో పాటు వ్యాపారులను ఎస్ఐ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రతి గ్రామం, ప్రతి వ్యాపార సంస్థ తమ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసు శాఖకు ప్రజల సహకారం ఉంటే నేరాలను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చని ఎస్ఐ గంగారం పేర్కొన్నారు.

## ఘనంగా ఉధమ్ సింగ్ వర్ధంతి

**మన దునియా, జులై 31,మంచిర్యాల జిల్లా**



భారత స్వాతంత్ర్య సమరయోధుడు ఉధమ్ సింగ్ వర్ధంతిని మందమర్రి పట్టణం లోని మాజీ ఆర్మీ జవాన్ ప్రస్తుత ఎస్ అండ్ పిసి ఉద్యోగి రాజేష్ పివ్ హోల్, రాణి పివ్ హోల్ దంపతులు శుక్రవారం తన నివాసంలో ఉధమ్ సింగ్ వర్ధంతిని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ పివ్ హోల్, రాణి పివ్ హోల్ దంపతులు మాట్లాడుతూ..ఉధమ్ సింగ్ భారతదేశానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు ఉధమ్ సింగ్ జలియన్‌వాలా బాగ్ హత్యాకాండకు ప్రతీకారంగా లండన్‌లో మైఖేల్ ఓ డయ్యర్‌ను హతమార్చి అమరుడయ్యారు. డిసెంబర్ 26, 1899న పంజాబ్ రాష్ట్రం సంగ్రూర్ జిల్లా సునమ్ నగరంలో జన్మించారు. (అసలు పేరు షేర్ సింగ్). చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో అమృత్‌సర్‌లోని ఖల్సా అనాథాశ్రమంలో పెరిగారు. అక్కడ సిక్కు ఆచారాల ప్రకారం ఉధమ్ సింగ్ అని పేరు పెట్టారు. భగత్ సింగ్ భావాల ద్వారా తీవ్రంగా ప్రభావితమై గదర్ పార్టీలో చేరి స్వాతంత్ర్య పోరాటం లో పాలుపంచుకున్నారు. జలియన్‌వాలా బాగ్ ప్రతీకారం ఏప్రిల్ 13, 1919లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్‌వాలా బాగ్ దారుణ మారణకాండను ఉధమ్ సింగ్ స్వయంగా చూశారు. దీనికి ప్రధాన కారకుడైన పంజాబ్ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ మైఖేల్ ఓ డయ్యర్‌ను అంతం చేయాలని శపథం చేశారు. 21 సంవత్సరాల పాటు ప్రణాళిక వేసి, మార్చి 13, 1940న లండన్‌లోని కాక్స్టన్ హాల్‌లో సమావేశం జరుగుతుండగా మైఖేల్ ఓ డయ్యర్‌ను కాల్చి చంపారు. పేరు మార్పు, మరణశిక్ష విచారణ సమయంలో తన పేరును రామ్ మొహమ్మద్ సింగ్ ఆజాద్ అని ప్రకటించుకున్నారు. ఇది భారతదేశంలోని ప్రధాన మతాల ఐక్యతను, దేశభక్తిని సూచిస్తుంది. బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు మరణశిక్ష జూలై 31, 1940న లండన్‌లోని పెంటన్‌విల్లే జైలులో ఉరితీశారన్నారు. ఇలాంటి స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను మనం ఆదర్శంగా తీసుకొని భావితరాలకు తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి. రఫీ సంఖ్యా శంకర్, జార్జ్ అశోక్, పురుషోత్తం సదానందం, కే. ఆనంద్, కె. రియాన్సిక, తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో పేకాట స్థావరంపై చీతా ఫోర్స్ దాడులు..ఆరుగురి అరెస్టు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి:**



నిజామాబాద్ జిల్లా నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఆర్యనగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై చీతా ఫోర్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతోపోలీసుల వివరాల ప్రకారం, ఆర్యనగర్‌లో పేకాట నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో చీతా ఫోర్స్ బృందం దాడులు చేపట్టింది. ఘటన స్థలంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుల వద్ద నుంచి రూ. 75 వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక ఆటో, ఒక మోటార్‌సైకిల్ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న వస్తువులతో పాటు నిందితులను నాలుగో టౌన్ పోలీసులకు అప్పగించారు. ప్రత్యేక నిఘా..ఈ ఘటనపై నాలుగో టౌన్ పోలీసులు సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నగరంలో అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో కన్నీళ్లు పెట్టుకున్న మాజీ మంత్రి హరీష్ రావు



**మన దునియా,వరంగల్ జిల్లా:జూన్ 31**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, అంతిమయాత్రలో మాజీ మంత్రి హరీశ్ రావు కన్నీళ్లు పెట్టు కున్నారు. బీఆర్ఎస్ నాయకుల తో కలిసి అంతిమ యాత్రలో పాల్గొన్న ఆయన ఆప్త మిత్రుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగా నికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాది గా ప్రజలు నర్సంపేట కు తరలివచ్చారు. అభిమాన నాయకు డిని చివరిసారిగా చూసేందుకు జనం పోటెత్తడంతో పట్టణ మంతా జనసంద్రంగా మారింది. పెద్ది అంతిమయాత్ర సందర్భంగా ప్రధాన రహదారులపై సుమా రు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించ గా, ఎటు చూసినా పెద్ది అభిమానులే కనిపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివ దేహం వరంగల్ జిల్లాలోని నర్సంపేట కు చేరుకున్నప్పటి నుంచి పట్టణంలోని వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. చిన్నా,పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తమ అభిమాన నాయకు డికి చివరి వీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. అభిమానుల రద్దీతో నర్సంపేట ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహనాలు నెమ్మది గా కదలడంతో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు.

## దొంగతనం కేసులో శంకర్ లాల్ కు సహకరించిన మహిళ అరెస్టు!

**మన దునియా,కరీంనగర్ జిల్లా జూలై 31**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిం చిన దొంగతనం కేసు ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు ఇప్పటికే ప్రధాన నిందితుడైన పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్పూర్ గ్రామానికి చెందిన జడ్పీటీసీ భర్త తగరం శంకర్ లాల్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన విష యం పాఠకులకు తెలిసిందే. ఈ క్రమంలో, గురువారం మధ్యా హ్నం మరో ట్విస్టు చోటుచేసుకుంది సుమారు 3.30 గంటల సమయంలో, కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి కి అందిన విశ్వసనీ య సమాచారం మేరకు, ఆయన తన సిబ్బందితో కలిసి తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్కు వెళ్లి అను మానాస్పదంగా సంచరిస్తున్న ఓ మహిళను అదుపు లోకి తీసుకుని విచారించారు. విచారణలో ఆమె తన పేరు ఆడెపు రేష్మా, కేశవపట్నం మండలం చింతగుట్ట పల్లి గ్రామానికి చెందినదని, అలాగే ఈ కేసులో మొదటి నిందితుడైన తగరం శంకర్‌కు సన్నిహితు రాలినని తెలిపింది. నిన్న తగరం శంకర్ ను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చెయ్యగా...శంకర్ లాల్ ను రిమాండ్‌కు తరలిం చిన విషయం పత్రిక ల్లో , టీవీ వార్తల ద్వారా తెలుసుకొని, తనను కూడా పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతో బంధువుల ఇంటికి వెళ్లేందుకు చంద్రా పూర్‌కు వెళ్లే రైలు కోసం తీగల గుట్టపల్లి రైల్వే స్టేషన్ లో వేచి ఉండగా పోలీసులు పట్టుకున్నారని తెలిపింది,తదుపరి విచారణ లో, దొంగతనం జరిగిన రోజున తాను కూడా తగరం శంకర్ కలిసి తీగలగుట్టపల్లి లోని ఫారెస్ట్ అధికారి శ్రీనివాస్ ఇంటిలోకి ప్రవేశించి, ఇంటి తాళాలు పగులగొట్టి, అనంతరం బాత్రూమ్ తాళం కూడా పగుల గొట్టి, అక్కడ ప్లాస్టిక్ నీళ్ల ఖాళీ డ్రమ్ములో దాచిపెట్టిన సుమారు రూ.26 లక్షల నగదు ను అపహరించినట్లు అంగీకరించింది. దొంగిలించిన డబ్బు లో తనకు కూడా కొంత వాటా ఇస్తానని తగరం శంకర్ చెప్పి నప్పటికీ, అనంతరం అతడు తన స్వగ్రా మానికి వెళ్లిపోయా డని, డబ్బు పంపిస్తా నని చెప్పి పంపలేద ని, తాను ఎదురు చూస్తుండగా అతడి ని పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపింది. తగరం శంకర్‌తో తాను నిరంతరం మాట్లాడేందుకు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను కూడా పంచుల సమక్షంలో స్వచ్ఛం దంగా చూపించి అప్పగించింది. తన ప్రమేయాన్ని పూర్తిగా అంగీకరించడంతో, పంచనామా నిర్వ హించి, నిందితురా లిని అదుపులోకి తీసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి, రిమాండ్ నిమిత్తం గురువారం న్యాయ స్థానం ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపా రు. ఈ కేసులో మిగిలిన అంశాలపై దర్యాప్తు కొనసాగు తున్నదని కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.




# ఊరపండుగ ఏర్పాట్లపై పోలీస్ కమీషనర్ క్షేత్రస్థాయి పర్యటన









**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ నగరంలో ఆదివారం నిర్వహించనున్న ఇందూరు నగర ఊరపండుగ నేపథ్యంలో నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, శుక్రవారం ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను సమీక్షించారు. ముందుగా నగరంలోని ఊరపండుగలో ప్రతిష్ఠించనున్న అమ్మవార్ల విగ్రహాల తయారు చేస్తున్న ప్రాంతాలను , రహదారులను ఆయన పరిశీలించారు. కళాకారులతో మాట్లాడి విగ్రహాల తయారీ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ఊరపండుగ శోభాయాత్ర నిర్వహించే మార్గాన్ని పరిశీలిస్తూ భద్రత , ట్రాఫిక్ నియంత్రణ , బారికేడింగ్ , ప్రజల రాకపోకల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. తదనంతరం సిర్నపల్లి గడికి చేరుకుని అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వసమాజ సమితి సభ్యులతో సమావేశమై ఊరపండుగ నిర్వహణ , భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు , శాంతిభద్రతల అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఊరపండుగను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమీషనర్ సూచించారు. ఈ పర్యటనలో నిజామాబాదు ఏసీపీ ప్రకాశ్ యాదవ్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , శ్రీ మలేష్ , నిజామాబాద్ టౌన్ సిఐ శ్రీనివాసరాజ్ , టౌన్ 1 ఎస్.హెచ్.ఓ శ్రీ రఘుపతి , రూరల్ ఎస్ హెచ్ ఓ శ్రీనివాస్ , టౌన్ 4 ఎస్ హెచ్ ఓ శ్రీ సతీష్ , టూ టౌన్ ఎస్ఐ శ్రీ యాదగిరి గౌడ్ , సర్వ సమాజ్ కన్వీనర్ రామర్థి గంగాధర్ , కార్యదర్శి బంటు రాజేశ్వర్ సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుప్తనిధుల పేరుతో ఘరానా మోసం..

- **అప్పు కింద రంగురాళ్లు అంటగట్టిన కేటుగాడు..!**
- **తీసుకున్న అప్పు తీర్చాలని అడిగితే గుప్తనిధుల్లో దొరికిన బంగారమని చెప్పి రంగు రాళ్లు అంటకట్టాడు. ఈ ఘటన నిజామాబాద్? జిల్లాలో వెలుగు చూసింది.**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**

నిజామాబాద్ జిల్లా తీసుకున్న అప్పు తీర్చాలని అడిగితే గుప్తనిధుల్లో దొరికిన బంగారమని రంగు రాళ్లు అంటకట్టాడు. ఈ ఘరానా మోసం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల పరిధిలో వెలుగు చూసింది. నిజామాబాద్ హమాల్ వాడికి చెందిన..ఎస్సై ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని హమాల్?వాడికి చెందిన పిల్ల రమేష్ కుమార్.. ఇంటి ముందు శ్రీనివాస్ అనే వ్యక్తి తన భార్యతో కలిసి గత 15ఏళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో రమేష్ వద్ద శ్రీనివాస్ రూ.1.30 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. ఆ అప్పు తీర్చమని రమేష్ ఎన్నిసార్లు ఒత్తిడి చేసినా శ్రీనివాస్ ఏవేవో కారణాలు చెబుతూ వాయిదా వేస్తూ వచ్చాడు

**.పక్కా పథకంతో స్కెచ్..**

రూపాయి కూడా తిరిగి ఇచ్చే ఉద్దేశం లేకపోవడంతో శ్రీనివాస్ ఓ మాయమాటల పథకానికి తెరలేపాడు. తనకు గుప్తనిధుల్లో బంగారం దొరికిందని, అప్పుకు బదులుగా ఆ బంగారాన్ని ఇస్తానని రమేష్‌కు ఆశ చూపాడు. అయితే ఈ విషయం బయటకు తెలియకూడదని, అందుకే ఇంటి దగ్గర కాకుండా వేరే ప్రదేశంలో కలవాలని సూచించాడు. అంతేకాకుండా, బంగారం ఇస్తున్నందుకు అదనంగా మరో రూ.32 వేలు ఇవ్వాలని మెలిక



పెట్టాడు.

**కుండలో బంగారపు పూత రాళ్లు!**

శ్రీనివాస్ మాటలను నమ్మిన రమేష్.. గురువారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామంలోని తన చుట్టాల ఇంటికి చేరుకుని నిందితుడికి సమాచారం అందించాడు. అక్కడకు చేరుకున్న నిందితులు ఒక కుండలో ఉన్న నాలుగు బంగారం రంగు పూసిన రాళ్లను రమేష్‌కు ఇచ్చి, అప్పుతో పాటు అదనంగా తెచ్చిన డబ్బును తీసుకుని అక్కడి నుంచి జారుకున్నాడు. వాళ్లు వెళ్లాక అనుమానం వచ్చి సరిగ్గా పరిశీలించగా.. అవి బంగారం కాదని, కేవలం రంగు పూసిన రాళ్లని తేలడంతో రమేష్ షాక్‌కు గురయ్యాడు. దారుణంగా మోసపోయానని గ్రహించిన బాధితుడు డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించినట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు.

## వరద ప్రాంతంలోసమయానికి స్పందించిన ఎన్టీఆర్ బృందం

గోదావరి నది వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయిన సమయంలో ప్రసవ వేదనతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీని సమయానికి ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం స్పందించి సురక్షితంగా వరద నీటిలో పడవతో తీసుకువెళ్లారు ఇసుక వాగు మార్గం పూర్తిగా దెబ్బతినడంతో ములుగు జిల్లా వాజేడు మండలం పెద్ద గొల్లగూడెం గ్రామానికి సంబంధించిన గర్భిణీ స్త్రీ ప్రసవ సమయము కావడంతో సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన ఎన్టీఆర్ బృందం ప్రత్యేక పడవ ద్వారా గర్భిణీ వరదనీటిలో మధ్యనుండి సురక్షితంగా ప్రాంతానికి తరలించి అక్కడ నుండి 108 అంబులెన్స్ ద్వారా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తక్షణ వైద్యశచికిత్సచర్యలు చేపట్టారు తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రాంతాల్లో గర్భిణీలు, చిన్న పిల్లలు వృద్ధులు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి



ప్రాధాన్యత ఇస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తామని తెలిపారు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వరదనీతిలోకి వెళ్ళవద్దని అధికారుల విజ్ఞప్తి చేశారు సూచనలు పాటించాలని అన్నారు ఎన్టీఆర్ బృందం చూపిన చొరవ కు స్థానిక ప్రజలు వర్షం వ్యక్తం చేశారు అభినందనలు తెలిపారు

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం
ఆగస్టు । శనివారం । 1 । 2026



# ప్రతి అర్హ ఓటును కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యం -- ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి










- బీజేపీ రాజ్యాంగబద్ధ సంస్థలను ప్రభావితం చేస్తోంది --
- ఎస్ ఐ ఆర్ అప్రమత్తంగా ఉండాలి
- బీజేపీ, బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- మోడీ హటావో -- దేశ్ కో బచావో నినాదం ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- జిల్లాస్థాయి ఎస్ ఐ ఆర్ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**

ఆర్మూర్ మండలం మామిడిపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన నిజామాబాద్ జిల్లా స్థాయి స్పెషల్ ఇంటెన్సివ్ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డితో కలిస నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, బీఎల్ఏ ఏజెంట్లు, సూపర్వైజర్లు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.దేశంలో రాజ్యాంగబద్ధ సంస్థలను బీజేపీ ప్రభుత్వం ప్రభావితం చేస్తోందని ఆరోపించిన ఎమ్మెల్యే, అందువల్లే కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక చొరవతో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తూ ప్రతి అర్హ ఓటును కాపాడేందుకు కృషి చేస్తోందన్నారు. బీహార్, బెంగాల్లో జరిగినట్లుగా ఓట్ల గల్లంతు లేదా అక్రమాల పరిస్థితి తెలంగాణలో తలెత్తకుండా ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఇప్పటి వరకు జరిగినది కేవలం ప్రాథమిక సవరణ మాత్రమేనని, ఇక నుంచి అసలు బాధ్యత ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిశీలించాలని, దొంగ ఓట్లపై అభ్యంతరాలు నమోదు చేయాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా వెలువడే వరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఒక్క అర్హ ఓటు కూడా కోల్పోకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తున్న బీఎల్ఏ ఏజెంట్లు, సూపర్వైజర్ల సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.ఇటీవల యువతకు సంబంధించిన అంశాల్లో బీజేపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రజలు గమనించారని, యువతకు మద్దతుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనకు స్పందనగా ఆయనను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. రాహుల్ గాంధీకి మద్దతుగా పార్టీ శ్రేణులు నిర్వహించిన ధర్నాలు అభినందనీయమని పేర్కొన్నారు. యువతకు కాంగ్రెస్ అండగా నిలవడం వల్లే కేంద్ర మంత్రిని రాజీనామా చేయించగలిగామని వ్యాఖ్యానించారు.రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చూడాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు కృషి చేయాలని, "మోడీ హటావో -- దేశ్ కో బచావో" నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, బడా కార్పొరేట్ వర్గాలకు మాత్రమే అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కారణంగానే నేడు ఈ పరిస్థితులు వచ్చాయని విమర్శించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఉంటే ప్రస్తుతం కరవు పరిస్థితులు ఉండేవి కావని అన్నారు. డ్యాములు నిర్మించిన తర్వాత కూడా నదుల నుంచి పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తామని చెప్పడం బీఆర్ఎస్ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే డా. . భూపతి రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ ఇంచార్జి వినయ్ రెడ్డి, బాల్కొండ,బోధన్, నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల ఎస్ ఐ ఆర్ ఇంచార్జి లు , ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర గీతా పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని 7 మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం  లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మద్యమద్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



# సోషల్ మీడియా మాటున మహిళల వేట..!

- వేధింపుల కేసులో ఎస్ఐ అరెస్ట్ -- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్
- బాధితురాలి ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన.. నిజామాబాద్‌లో పట్టుకున్న పోలీసులు




**మన దునియా -- । జులై 31**

సోషల్ మీడియాను అడ్డాగా చేసుకుని మహిళలతో పరిచయాలు పెంచుకుని, అనంతరం లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన సబ్ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) కదిరే శ్రీకాంత్‌ను సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రత్యేక బృందంతో నిజామాబాద్ జిల్లాలో నిందితుడిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసుల దర్యాప్తులో, సోషల్ మీడియా ద్వారా మహిళల నమ్మకాన్ని సంపాదించిన అనంతరం అసభ్యకరంగా ప్రవర్తించడం, లైంగికంగా వేధించడం, బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని వెల్లడైంది. బాధితురాలు ధైర్యంగా ఫిర్యాదు చేయడంతో వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.నిజామాబాద్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు హనుమకొండకు తరలించి విచారణ చేపట్టారు. కేసుకు సంబంధించిన ప్రాథమిక ఆధారాలు సేకరించిన అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, హనుమకొండ మూడో అదనపు న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అనంతరం జైలుకు తరలించారు.ఈ సందర్భంగా సుబేదారి సీఐ రంజిత్ కుమార్ మాట్లాడుతూ, సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయాల విషయంలో మహిళలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి వేధింపులు, బెదిరింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు.

# కరెంట్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూరీలు దగ్ధం ఆర్థిక సాయం చేస్తున్న బి ఆర్ఎస్ మండల అధ్యక్షుడు



**మన దునియా, వాజేడు ,జులై 31**

వాజేడు మండలం మండల కేంద్రంలో చెన్నం రాజు ఇల్లు కరెంటు షార్ట్ సర్క్యూట్తో పూరీల్లు పూర్తిగా కాలిపోయింది దీనితో ఆ కుటుంబం నిలువ నీడ లేకుంటా అయినది రాజుకు ప్రభుత్వం నుండి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్ల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు గత రాత్రి షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు పూర్తిగా దగ్ధమై రోడ్డు పాలైన చెన్నం రాజ్ కుటుంబాన్ని బి ఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో పరామర్శించిన చెన్నంరాజు కుటుంబానికి వారానికి సరిపడా సరుకులు మరియు నిత్యవసర సరుకులు గిన్నెలు ఐదువేల రూపాయల ఆర్థిక సాయం అందించారు మనో ధైర్యాన్ని నింపుతూ ప్రభుత్వం తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని జీవన ఉపాధి అయిన ఫోటోగ్రాఫర్ కు సంబంధించిన కెమెరాలు ల్యాప్టాప్ కంప్యూటర్ సామాగ్రి పూర్తిగా మంటల్లో కాలిపోయినందున అతని జీవన ఉపాధికి ప్రభుత్వం తక్షణ సాయాన్ని అందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ముడిగ తిరుపతి యాదవ్ మాజీ ఎంపీటీసీ గొంది రమణారావు ఎస్సీ సెల్ నాయకులు చెన్నం సాంబశివరావు చెన్నం సమ్మయ్య సీనియర్ నాయకులు తల్లడి వెంకటేశ్వర్లు జాపాకుల తాతారావు యూత్ నాయకులు గౌరబోయిన శ్రీకాంత్ శగం ప్రశాంత్  కుడుముల చంటి బోధ బోయిన సత్యం మాజీ ఉపసర్పంచ్ కల్లూరి సతీష్ పాల్గొన్నారు

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం




# ఐసీసీ కీలక ప్రకటన.. 2027 వన్డే ప్రపంచకప్‌కు 12 వేదికలు ఖరారు

**24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆఫ్రికాలో 2027 క్రికెట్ ప్రపంచకప్**

**దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం**

**మొత్తం 12 వేదికలను అధికారికంగా ప్రకటించిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్**

**14 జట్లు, 57 మ్యాచ్‌లతో సరికొత్త ఫార్మాట్‌లో టోర్నమెంట్ నిర్వహణ**







24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌కు ఆఫ్రికా ఖండం మరోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. 2027లో జరగనున్న ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌ను దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఈ మెగా టోర్నమెంట్‌కు సంబంధించిన 12 వేదికలను, అధికారిక బ్రాండ్‌ను ఐసీసీ ప్రకటించింది. జొహన్నెస్‌బర్గ్‌లో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో ఈ వివరాలను వెల్లడించారు. 'త్రీ నేషన్స్, వన్ హార్ట్‌బీట్' (మూడు దేశాలు, ఒకే స్పందన) అనే నినాదంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ఆఫ్రికాలోని ఐక్యత, వైవిధ్యం, "నేను ఉన్నానంటే మనం ఉన్నందుకే" అనే అర్థాన్నిచ్చే 'ఉబుంటు' తత్వాన్ని ఈ బ్రాండ్ ప్రతిబింబిస్తుంది. దక్షిణాఫ్రికాలో 8, జింబాబ్వేలో 3, నమీబియాలో ఒక వేదికను ఈ టోర్నీ కోసం ఎంపిక చేశారు.కొత్త ఫార్మాట్‌లో టోర్నమెంట్ ఈసారి ప్రపంచకప్‌ను సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. మొత్తం 14 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో 57 మ్యాచ్‌లు జరుగుతాయి. టోర్నమెంట్‌లో పోటీతత్వాన్ని పెంచేందుకు మూడు దశల విధానాన్ని ప్రవేశపెట్టారు. 12 నుంచి 14వ ర్యాంకులో ఉన్న జట్ల మధ్య జరిగే 'సూపర్ సిరీస్'తో టోర్నీ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించి గ్రూప్ స్టేజ్ నిర్వహిస్తారు. అనంతరం 'సూపర్ 7' రౌండ్, సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు ఉంటాయి. ఈ ప్రకటనపై ఐసీసీ ఛైర్మన్ జై షా మాట్లాడుతూ.. ఆఫ్రికాలో క్రికెట్ పునరాగమనానికి ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. ఐసీసీ సీఈవో సంజోగ్ గుప్తా స్పందిస్తూ.. ఈ ఈవెంట్ ఆఫ్రికా సంస్కృతులు, ప్రజలు, క్రీడపై వారికున్న అభిరుచికి ఒక వేడుకగా నిలుస్తుందని తెలిపారు. సవరించిన ఫార్మాట్ టోర్నీకి మరింత ప్రాధాన్యం, ఉత్కంఠను అందిస్తుందని ఆయన వివరించారు.

వేదికల వివరాలు

దక్షిణాఫ్రికా: వాండరర్స్ (జొహన్నెస్‌బర్గ్), సెంచూరియన్ (ష్వానే), న్యూలాండ్స్ (కేప్ టౌన్), కింగ్స్‌మీడ్ (దర్బన్), సెయింట్ జార్జ్ పార్క్ (గెబెర్హా), మంగాంగ్ ఓవల్ (బ్లూమ్‌ఫోంటెన్), బోలాండ్ పార్క్ (పార్ల్), బఫెలో పార్క్ (కుగోంపో సిటీ). జింబాబ్వే: హరారే స్పోర్ట్స్ క్లబ్ (హరారే), క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ (బులవాయో), ఫాలే మోసీ-ఓ-తున్యా ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం (విక్టోరియా ఫాల్స్). నమీబియా: నమీబియా క్రికెట్ గ్రౌండ్ (విండ్‌హోక్).ప్రత్యేక ఆకర్షణగా బ్రాండింగ్ టోర్నమెంట్ విజువల్ ఐడెంటిటీని ఆఫ్రికన్ సంప్రదాయ వైర్ బౌల్ స్ఫూర్తితో రూపొందించారు. జింబాబ్వే చిల్లీ, ఆఫ్రికన్ రూట్, నమీబ్ డ్యూన్ వంటి ప్రత్యేక రంగులను ఇందులో ఉపయోగించారు. కాగా, సీనియర్ ఐసీసీ గ్లోబల్ ఈవెంట్‌కు నమీబియా ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి. చివరిసారిగా 2003లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, కెన్యా సంయుక్తంగా ప్రపంచకప్‌ను నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో గ్రేమ్ స్మిత్, మఖాయా ఎన్తిని, హషీమ్ ఆమ్లా, టెంబా బావుమా వంటి మాజీ, ప్రస్తుత ఆటగాళ్లు పాల్గొన్నారు. టికెట్ సమాచారం కోసం అభిమానులు తమ ఆసక్తిని నమోదు చేసుకోవచ్చని ఐసీసీ సూచించింది.

# గ్లాస్గోలో భారత పతకాల వేట.. లవ్‌ప్రీత్‌కు రజతం, సీమాకు కాంస్యం

**కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు మరో రెండు పతకాలు**

**వెయిట్‌లిఫ్టింగ్‌లో లవ్‌ప్రీత్ సింగ్‌కు రజత పతకం**

**మహిళల డిస్కస్‌త్రోలో కాంస్యం గెలిచిన సీమా కలిరమణ**

**17కి చేరిన ఇప్పటివరకు భారత్ సాధించిన పతకాల సంఖ్య**

**డెకథ్లాన్‌లో పతకం రేసులో కొనసాగుతున్న తేజస్విన్ శంకర్**

గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ తన పతకాల సంఖ్యను మరింత పెంచుకుంది. నిన్న జరిగిన పోటీల్లో వెయిట్‌లిఫ్టర్ లవ్‌ప్రీత్ సింగ్ రజతం సాధించగా, డిస్కస్ త్రోయర్ సీమా కలిరమణ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో భారత్ ఇప్పటివరకు సాధించిన పతకాల సంఖ్య 17కి (3 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్యాలు) చేరింది. పురుషుల ం110 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో లవ్‌ప్రీత్ సింగ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనతో మొత్తం 388 కేజీల (స్నాచ్‌లో 176 కేజీలు ం క్లీన్ అండ్ జర్క్‌లో 212 కేజీలు) బరువును ఎత్తి రజత పతకాన్ని ముద్దాడాడు. స్నాచ్ విభాగంలో 176 కేజీలు ఎత్తి కామన్వెల్త్ గేమ్స్ రికార్డు సృష్టించిన లవ్‌ప్రీత్, ఆ దశ తర్వాత అగ్రస్థానంలో నిలిచాడు. అయితే, న్యూజిలాండ్ లిఫ్టర్ డేవిడ్ ఆంద్రూ లిటి క్లీన్ అండ్ జర్క్‌లో 223 కేజీలతో గేమ్స్ రికార్డు నెలకొల్పి, మొత్తం 389 కేజీలతో స్వర్ణాన్ని గెలుచుకున్నాడు. దీంతో లవ్‌ప్రీత్ కేవలం ఒక్క కిలో తేడాతో స్వర్ణ పతకాన్ని కోల్పోయాడు. 2022 బర్మింగ్‌హామ్ క్రీడల్లో కాంస్యం గెలిచిన లవ్‌ప్రీత్, ఈసారి తన ప్రదర్శనను మెరుగుపరుచుకున్నాడు. ఈ క్రీడల్లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మొత్తం 8 పతకాలు (ఒక స్వర్ణం, ఆరు రజతాలు, ఒక కాంస్యం) సాధించి తన ప్రస్థానాన్ని ముగించింది.అథ్లెటిక్స్‌లో మహిళల డిస్కస్‌త్రోలో సీమా కలిరమణ 58.65 మీటర్ల దూరం విసిరి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. తల్లయ్యాక తిరిగి పోటీల్లోకి రావడం, పీహెచ్‌డీ చేస్తూనే ఈ ఘనత సాధించడం విశేషం. పోటీలో మూడుసార్లు ఫౌల్ చేసినప్పటికీ, మూడో స్థానాన్ని నిలబెట్టుకోవడంలో ఆమె సఫలమైంది. ఈ విభాగంలో జమైకాకు చెందిన సమంత హాల్ (61.66 మీ) స్వర్ణం, కెనడాకు చెందిన జూలియా టంక్స్ (60.67 మీ) రజతం గెలుచుకున్నారు. మరో భారత క్రీడాకారిణి నిధి రాణి 55.67 మీటర్లతో నాలుగో స్థానంలో నిలిచింది. అయితే, కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ ఎదురైంది. పురుషుల 200 మీటర్లు, 400 మీటర్ల విభాగాల్లో అనిమేష్ కుజుర్, విశాల్ టీకే ఫైనల్స్‌కు చేరుకోలేకపోయారు. మహిళల 5000 మీటర్లలో పారుల్ చౌదరి 13వ స్థానంతో సరిపెట్టుకుంది. షాట్‌పుట్‌లో తాజిందర్‌పాల్ సింగ్ తూర్, సమర్‌దీప్ సింగ్ గిల్ వరుసగా ఐదు, ఏడో స్థానాల్లో నిలిచారు. లాన్ బౌల్స్‌లో మాత్రం నవనీత్ సింగ్, దినేష్ కుమార్ జోడీ వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది.






## అవకాశాల కోసం ఆరాటపడని అసాధారణ ఆటగాడు రహానె: వీడ్కోలుపై సచిన్ భావోద్వేగ పోస్ట్



**రహానెలో ఒక ప్రత్యేకమైన ఆటగాడిని చూశానన్న సచిన్**

**జట్టు విజయం కోసం కష్టపడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండేవాడని వ్యాఖ్య**

**సంయమనంతో ఆడటం దూకుడుకు అడ్డుకాదని నిరూపించావన్న సచిన్**

అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన అజింక్య రహానెపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల జల్లు కురిపించారు. జెర్సీ నంబర్ 278కి వీడ్కోలు పలుకుతూ రహానె సోషల్ మీడియా వేదికగా రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో సచిన్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు."మనం తొలిసారి ముంబయి జట్టు తరఫున కలిసి బ్యాటింగ్ చేసినప్పుడే... అవకాశాల కోసం ఎన్నడూ వెంటపడని ఒక ప్రత్యేకమైన ఆటగాడిని నీలో చూశాను. జట్టు విజయం కోసం కష్టపడేందుకు నువ్వు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవాడివి, అందుకే అవకాశాలే నిన్ను వెతుక్కుంటూ వచ్చేవి. నీకున్న ఆ గొప్ప లక్షణమే ఆస్ట్రేలియా గడ్డపై నీ కెరీర్‌లోనే మరచిపోలేని అత్యుత్తమ విజయ క్షణాలను అందించింది. సంయమనంతో ఆడటం అనేది దూకుడుకు ఎప్పుడూ అడ్డుకాదని నువ్వు నిరూపించావు. వండర్‌ఫుల్ కెరీర్ రహానె, కంగ్రాచులేషన్స్!" అని సచిన్ కొనియాడారు.రహానె సుదీర్ఘ అంతర్జాతీయ ప్రయాణానికి ముగింపు పలకడంతో, భారత మాజీ, ప్రస్తుత క్రికెటర్లు కూడా సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ టీమిండియాకు ఆయన అందించిన అద్భుత సేవలను గుర్తుచేసుకుంటున్నారు.

## ఫిఫాకు యూఈఎఫ్‌ఏ షాక్.. వరల్డ్ కప్‌ను బాయ్‌కాట్ చేస్తామని హెచ్చరిక

**ఫిఫా కొత్త ఆర్థిక ప్రతిపాదనపై యూఈఎఫ్‌ఏ తీవ్ర అభ్యంతరం**

**వరల్డ్ కప్ సహా అన్ని టోర్నీలను బాయ్‌కాట్ చేస్తామని హెచ్చరిక**

**ప్రైవేట్ పెట్టుబడుల కోసం ఫిఫా ప్రయత్నించడమే వివాదానికి కారణం**

**వరల్డ్ కప్ అమ్మకానికి కాదని యూఈఎఫ్‌ఏ స్పష్టత**

**యూరప్‌తో పాటు ఇతర ఫుట్‌బాల్ సమాఖ్యల నుంచి కూడా వ్యతిరేకత**

ప్రపంచ ఫుట్‌బాల్‌లో పెను సంక్షోభం తలెత్తింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) తీసుకున్న ఓ వివాదాస్పద నిర్ణయంపై యూరప్ ఫుట్‌బాల్ సమాఖ్య (యూఈఎఫ్‌ఏ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫిఫా తన ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే, వరల్డ్ కప్ సహా ఫిఫా నిర్వహించే అన్ని టోర్నమెంట్‌లను బహిష్కరిస్తామని యూఈఎఫ్‌ఏకు చెందిన 55 సభ్య దేశాలు ఏకగ్రీవంగా హెచ్చరించాయి.ఫిఫా వరల్డ్ కప్ వంటి ప్రపంచ స్థాయి టోర్నమెంట్‌ల వాణిజ్య హక్కులను నిర్వహించేందుకు 20 బిలియన్ డాలర్ల విలువైన ఒక కొత్త అనుబంధ సంస్థను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఇందులో 20 శాతం వాటాను ప్రైవేట్ పెట్టుబడిదారులకు విక్రయించాలని ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్ఫాంటినో ప్రతిపాదించారు. దీనిపై గురువారం జరిగిన వర్చువల్ సమావేశంలో యూఈఎఫ్‌ఏ సభ్య దేశాలు తీవ్రంగా చర్చించి, ఈ ప్రతిపాదనను పూర్తిగా తిరస్కరించాయి."వరల్డ్ కప్ అనేది ఒక పెట్టుబడి ఉత్పత్తి కాదు. అది తరతరాలుగా ఆటగాళ్లు, అభిమానులు నిర్మించుకున్న గొప్ప క్రీడా వారసత్వం. దాన్ని ప్రైవేట్ పెట్టుబడిదారులకు అప్పగించకూడదు. వరల్డ్ కప్ అమ్మకానికి కాదు" అని యూఈఎఫ్‌ఏ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేసే వరకు ఫిఫా టోర్నీలలో పాల్గొనబోమని తేల్చిచెప్పింది. ఇంగ్లండ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కూడా యూఈఎఫ్‌ఏ నిర్ణయానికి మద్దతు ప్రకటించింది.యూరప్‌తో పాటు ఆసియా (ఏఎఫ్‌సీ), ఉత్తర అమెరికా (కాన్‌కాకాఫ్) ఫుట్‌బాల్ సమాఖ్యలు కూడా ఫిఫా ఏకపక్ష నిర్ణయాన్ని, సంప్రదింపుల లోపాన్ని తప్పుబట్టాయి. ఈ పరిణామాలతో 2027 మహిళల వరల్డ్ కప్ వంటి రాబోయే టోర్నీలపై నీలినీడలు కమ్ముకున్నాయి.



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం

# రజనీకాంత్ నుంచి రాశీ ఖన్నాకు ప్రత్యేక బహుమతి





**ఆధ్యాత్మిక పుస్తకం అందించిన సూపర్‌స్టార్**

**పుస్తకం పేరు 'లివింగ్ విత్ ది హిమాలయన్ మాస్టర్స్'**

**'ధర్మన్' షూటింగ్‌లో జరిగిన ఆసక్తికర సంఘటన**

**పుస్తకం తనలో కొత్త ఆలోచనలు రేకెత్తించిందన్న రాశీ**

**చదివిన తర్వాత ప్రశ్నలు అడుగుతానన్న రజనీ**

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నుంచి అందుకున్న ప్రత్యేక బహుమతి గురించి నటి రాశీ ఖన్నా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం 'ధర్మన్' సినిమా చిత్రీకరణలో రజనీకాంత్‌తో కలిసి నటిస్తున్న ఆమెకు 'లివింగ్ విత్ ది హిమాలయన్ మాస్టర్స్' అనే ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఆయన బహుమతిగా ఇచ్చారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో ద్వారా వెల్లడించారు.'ధర్మన్' షూటింగ్ సమయంలో ఆధ్యాత్మికతపై తమ మధ్య చర్చ జరిగిందని రాశీ తెలిపారు. ఆ సందర్భంగా ఈ పుస్తకం చదివావా అని రజనీకాంత్ అడిగారని చెప్పారు. తాను లేదని చెప్పిన రెండు రోజులకే స్వయంగా ఆ పుస్తకం తీసుకొచ్చి బహుమతిగా ఇచ్చారని వెల్లడించారు. అంతేకాదు, పుస్తకం చదివిన తర్వాత ప్రశ్నలు కూడా అడుగుతానని సరదాగా చెప్పారని గుర్తుచేసుకున్నారు.గత కొన్ని వారాలుగా ఆ పుస్తకాన్ని ఎంతో ఆసక్తిగా చదువుతున్నానని రాశీ చెప్పారు. అందులోని కొన్ని పేజీలు చదివిన ప్రతిసారీ ఆలోచనలో మునిగిపోతున్నానన్నారు. మనలో చాలామంది తమ అసలు వ్యక్తిత్వాన్ని కోల్పోయి, వేరొకరిగా మారేందుకు ప్రయత్నించడం వల్లే అంతర్గతంగా దూరమవుతున్నామనే భావన తనను బాగా ప్రభావితం చేసిందని వెల్లడించారు.అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న 'ధర్మన్'పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. రజనీకాంత్, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం తమిళంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా నిలిచింది.

# రెండో పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన నటి సురేఖావాణి: ట్రోలింగ్, గాలి వార్తలపై ఘాటు స్పందన!

**ఇటీవలి కాలంలో తెలుగు సినిమాలకు కాస్త దూరమైన సురేఖావాణి**

**తనకు రెండో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని వెల్లడి**

**ఆ ఆలోచన ఉంటే ఇప్పటి వరకు ఆగేదాన్ని కాదన్న సురేఖ**

టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి గుర్తింపు పొందిన నటి సురేఖావాణి... కొంతకాలంగా తెలుగు సినిమాలకు కాస్త దూరమై తమిళ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ప్రస్తుతం ఆమె దర్శకుడు కృష్ణ బలరామ్ తెరకెక్కిస్తున్న 'నిరమ్' అనే క్రైమ్ థ్రిల్లర్ మూవీలో నటిస్తున్నారు. తాన్యా హోప్, ప్రీతి అస్రాని, నితిన్ సత్య కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కెస్వేర్ సినిమాస్ నిర్మిస్తుండగా, డి. ఇమ్మాన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న సురేఖావాణి... తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న రకరకాల పుకార్లకు, సోషల్ మీడియా ట్రోలింగ్‌కు గట్టి సమాధానం ఇచ్చారు.రెండో పెళ్లి వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. "నాకు రెండో పెళ్లి చేసుకునే ఉద్దేశం ఏమాత్రం లేదు. ఒకవేళ ఆ ఆలోచనే ఉంటే ఇప్పటివరకు ఆగేదాన్ని కాదు కదా? ఇప్పుడు నా కూతురికి పెళ్లి చేసే వయసు వచ్చింది, ఈ దశలో నాకేంటి పెళ్లి?" అని ప్రశ్నించారు. అంతేకాకుండా "నా పెళ్లి ఎప్పుడో జరిగిపోయిందని మీడియానే వార్తలు రాసేసిందిగా" అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు.ఇక సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై స్పందిస్తూ.. "నాకు నచ్చిన ఫొటోలు, పోస్టులు నేను పెడతాను. నా జీవితం, నా ప్రాధాన్యతలు నాకే ముఖ్యం. పక్కవారు ఏమనుకుంటారో అని ఆలోచించడం మానేసి చాలా కాలమైంది" అని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లోనూ, సోషల్ మీడియాలోనూ ఆసక్తికరంగా మారాయి.



# ఒకవైపు నీతులు, మరోవైపు పార్టీలా?.. కంగన పాత వీడియోతో సోషల్ మీడియాలో రచ్చ

బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. యువతరంపై ఆమె చేసిన 'గట్టర్ జనరేషన్' వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ, ఆమెకు సంబంధించిన ఒక పాత వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల నీట్-యూజీ 2026 నిరసనలపై స్పందిస్తూ, ఆందోళనల్లో పాల్గొంటున్న మహిళలను ఉద్దేశించి కంగనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాశ్చాత్య సంస్కృతిని అనుసరించే కొందరు భారతీయ మహిళలు దేశ సంప్రదాయాలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్నారని, వారిని 'జనరేషన్ గట్టర్' అని పిలుస్తానని అన్నారు. వారికి చదువు సరిగా రాదని, మంచి గృహిణులుగా కూడా ఉండలేరని ఘాటుగా విమర్శించారు. అంతకుముందు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధి సౌరవ్ దాస్‌ను 'పనికిరాని నిరుద్యోగి' అని తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పేర్కొన్నారు. వైరల్ అవుతున్న పాత వీడియో ఈ వివాదం నడుస్తుండగానే, కంగనాకు సంబంధించిన ఒక పాత వీడియోను నెటిజన్లు వెలుగులోకి తెచ్చారు. 2018లో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా జరిగిన ఒక ఆఫ్టర్-పార్టీలో కంగనా ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ, సరదాగా గడుపుతున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. నలుపు రంగు దుస్తుల్లో ఆమె స్వేచ్ఛగా పార్టీని ఆస్వాదిస్తున్నట్లు కనిపించింది. సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన ఈ వీడియో వైరల్ అవ్వడంతో సోషల్ మీడియాలో పెద్ద చర్చే మొదలైంది. యువతకు, మహిళలకు నీతులు చెబుతున్న కంగనా, గతంలో ఇలా పార్టీలలో స్వేచ్ఛగా గడపడం ఏమిటని కొందరు ఆమె ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తూ ట్రోల్ చేస్తున్నారు. అయితే, మరికొందరు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. "ఆమె తన వ్యక్తిగత జీవితంలో సరదాగా గడపటంలో తప్పేముంది? ఎవరినీ ఇబ్బంది పెట్టనంత వరకు సమస్య లేదు కదా?" అంటూ కామెంట్లు పెడుతున్నారు. తన నటనతో ఎంతో పేరు తెచ్చుకున్న కంగనా, ఇలాంటి వ్యాఖ్యలతో తన స్థాయిని తగ్గించుకోవద్దని మరికొందరు హితవు పలుకుతున్నారు. మొత్తంమీద, సౌరవ్ దాస్‌తో మొదలైన మాటల యుద్ధం, 'గట్టర్ జనరేషన్' వ్యాఖ్యలతో మరింత ముదిరి, ఇప్పుడు పాత వీడియో వైరల్ అవ్వడంతో ఈ వివాదం మరింత పెద్దదవుతోంది. ఈ అంశంపై నటులు సోనూసూద్, రాఖీ సావంత్ వంటి వారు కూడా కంగనా వ్యాఖ్యలను విమర్శించారు.



# షూటింగ్‌లో రష్మికకు గాయం.. ఆరు వారాల విశ్రాంతి

**పాట చిత్రీకరణలో డ్యాన్స్ చేస్తుండగా ప్రమాదం**

**తుంటి భాగంలో తీవ్ర గాయమైనట్టు నిర్ధారణ**

**విశ్రాంతి తీసుకోవాలని సూచించిన వైద్యుల సూచన**

ప్రముఖ నటి రష్మిక మందన్న ఒక చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారు. ఒక పాట చిత్రీకరణలో భాగంగా డ్యాన్స్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆమెను పరీక్షించిన వైద్యులు తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు నిర్ధారించి, ఆరు వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం రష్మిక మందన్న 'రణబాలి' అనే చిత్రంలో తన భర్త, హీరో విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్నారు. దీనితో పాటు, 'మైసా' అనే మహిళా ప్రాధాన్యత కలిగిన చిత్రంలోనూ ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న తరుణంలో రష్మిక గాయపడటం ఆమె నటిస్తున్న చిత్రాల షూటింగ్‌లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆరు వారాల పాటు రష్మిక విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో, ఆమె అంగీకరించిన సినిమాల చిత్రీకరణ షెడ్యూల్స్ వాయిదా పడనున్నాయి. ఈ గాయం నుండి ఆమె త్వరగా కోలుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com